క్లుప్తంగా

ప్రతి ఇంటికి విద్యుత్ కనెక్షన్ ఇవ్వాలి



కాజీపేట: వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలో ఉన్న స్లమ్స్ ఏరియాల్లో ప్రతి ఇంటికీ విద్యుత్ కనెక్షన్ ఇవ్వాలని లేని పక్షంలో ఎన్పీడీసీఎల్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎనుగుల రాకేష్ రెడ్డి హెచ్చరించారు. కాజీపేట 63వ డివిజన్ వడ్డెర కాలనీలో సోమవారం పార్టీ శ్రేణులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చీఫ్ విప్ వినయ్ భాస్కర్ వడ్డెర కాలనీలో పర్యటించి నిత్యం వారు ఎదుర్కొంటున్న బాధలు వినాలని డిమాండ్ చేశారు. పార్టీ నాయకులు మేకల శ్రవణ్ కుమార్‌తో పాటు కార్యకర్తలు పాల్గొన్నారు.

నియామకం



హన్మకొండ: బీజేపీ ఎస్సీ మోర్చా హనుమకొండ జిల్లా కార్యదర్శిగా గట్టుపల్లి ఎనోష్‌ను నియమించారు. సోమవారం హనుమకొండ హంటర్ రోడ్డులోని క్యాంపు కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ, ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు మధు నియామక పత్రం అందించారు. బీజేపీ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటున్న కాజీపేటకు చెందిన గట్టుపల్లి ఎనోష్‌ను ఎస్సీ మోర్చా జిల్లా కార్యదర్శిగా నియమించినట్లు వారు తెలిపారు.

కేసీఆర్‌కు ఆహ్వానం



హన్మకొండ: సీఎం కేసీఆర్‌ను రాష్ట్ర రుణ విమోచన కమిషన్ చైర్మన్ నాగుర్ల వెంకటేశ్వర్లు సోమవారం హైదరాబాద్‌లో కలిశారు. తన కుమారుడి వివాహ పత్రికను వెంకన్న సీఎంకు అందించి, 12వ తేదీన జరిగే వివాహానికి రావాలని ఆహ్వానించారు.

అభినందనలు



కాజీపేట అర్బన్: గ్రేటర్ వరంగల్ 31వ డివిజన్ పరిధిలోని శ్రీ రాజరాజేశ్వరీ ఆటో యూనియన్ నూతన కమిటీని సోమవారం ఎన్నుకున్నారు. నూతన కమిటీ అధ్యక్షుడిగా వేల్పుల సాంబమూర్తి, ఉపాధ్యక్షుడిగా బోళ్ల సునీల్, కోశాధికారిగా రాసమల్ల సురేష్‌లను ఆటో యూనియన్ కార్మికులు ఎన్నుకున్నారు. కాగా, నూతన కమిటీని ప్రభుత్వ చీఫ్‌విప్ దాస్యం వినయ్‌భాస్కర్, కార్పొరేటర్ మామిండ్ల రాజు అభినందించారు.

సీఎంఆర్‌ఎఫ్‌తో భరోసా

హసన్‌పర్తి: నిరుపేదల వైద్యానికి సీఎంఆర్‌ఎఫ్ భరోసా అని వర్ధన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేష్ అన్నారు. మడిపల్లికి చెందిన చిర్ర జ్యోతి అనారోగ్యంతో బాధపడున్న చికిత్స నిమిత్తం రూ.2.50లక్షల ఎల్‌ఓసీని బాధిత కుటుంబసభ్యులకు ఎమ్మెల్యే సోమవారం అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రమేష్ మాట్లాడుతూ.. అర్హులైన ప్రతి ఒక్కరినీ సీఎంఆర్‌ఎఫ్ ద్వారా ఆదుకుంటున్నట్లు వివరించారు. ఈకార్యక్రమంలో అంచూరి విజయ్, ఇంద్రయ్య, రాజు, రంజిత్ పాల్గొన్నారు

మార్కెట్‌కు మస్త్ మామిడి



వరంగల్: వరంగల్ మార్కెట్ పరిధిలోని జానకీరామ ఇండస్ట్రీస్‌లో నిర్వహిస్తున్న కొనుగోళ్ల స్థలానికి సోమవారం 314 వాహనాల్లో (బొలేరో) రైతులు మామిడి కాయలు తీసుకొచ్చారు. వ్యాపారులు టన్నుకు నాణ్యతను బట్టి రూ.10వేల నుంచి 40వేల వరకు ధరలు నిర్ణయించారు. ఆశించిన ధరలు లేక పోవడంతో 84బండ్ల మామిడి కాయలను రైతులు వాపస్ తీసుకుపోయినట్లు తెలిసింది. గాలివాన వల్ల భారీ మొత్తంలో మార్కెట్‌కు మామిడి కాయలు వచ్చినట్లు పండ్ల మార్కెట్ అధికారులు, సిబ్బంది తెలిపారు.

పనికి తగిన వేతనం చెల్లించాలి

సమానపనికి సమాన వేతనం చెల్లించినప్పుడే కార్మికుల కష్టానికి ఫలితం దక్కినట్టని పలువురు కార్మికులు, కార్మిక సంఘాల బాధ్యులు అభిప్రాయపడ్డారు. సోమవారం కార్మిక దినోత్సవం(మే డే) సందర్భంగా కార్మికులు తాము పనిచేసే చోట అరుణపతాకాన్ని ఆవిష్కరించి, కార్మికుల హక్కుల కోసం పోరాడి అమరులైనవారికి నివాళులర్పించారు. ఆయా కార్యక్రమాల్లో పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొని కార్మికుల సేవలను కొనియాడారు.

– సాక్షి నెట్‌వర్క్



వరంగల్: లక్ష్మీపురం మార్కెట్‌లో జెండాను ఆవిష్కరించి మాట్లాడుతున్న ఎమ్మెల్యే నరేందర్



విద్యారణ్యపురి: హనుమకొండ టీఎస్‌యూటీఎఫ్ కార్యాలయంలో..



కాశిబుగ్గ: ఐఎఫ్‌టీయూ నాయకుల ర్యాలీ



కాజీపేట: చౌరస్తాలో..



హనుమకొండ చౌరస్తాలో..



న్యూశాయంపేట: సీపీఐ కార్యాలయం ఎదుట..



కాజీపేట అర్బన్ : మాట్లాడుతున్న సారంగపాణి



వరంగల్: జెండాను ఎగరవేసిన మేస్త్రీల సంఘం



ఖిలా వరంగల్: బొల్లికుంటలో..



ఎంజీఎం : జెండాను ఆవిష్కరిస్తున్న నాయకులు



హన్మకొండ చౌరస్తా: మాట్లాడుతున్న రాజేందర్‌రెడ్డి



నయీంనగర్: 6వ డివిజన్‌లో..



మడికొండ: రాంపూర్ లిక్కర్ డిపోలో..



కాజీపేట రూరల్: అన్నదానం చేస్తున్న ఆటో యూనియన్ నాయకులు



కుమార్‌పల్లిలో..

చలి వేంద్రం ఏర్పాటు అభినందనీయం



చలి వేంద్రాన్ని ప్రారంభిస్తున్న గోపాల్ రావు

హన్మకొండ: తెలంగాణ పవర్ డిప్లమో ఇంజనీర్స్ అసోషియేషన్ ఆధ్వర్యంలో ప్రతి ఏటా వేసవిలో చలి వేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయమని, టీఎస్ ఎన్పీడీసీఎల్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ అన్నమనేని గోపాల్ రావు అన్నారు. హనుమకొండ నక్కలగుట్టలోని టీఎస్ ఎన్పీడీసీఎల్ ప్రధాన కార్యాలయం ఎదుట తెలంగాణ పవర్ డిప్లమో ఇంజనీర్స్ అసోషియేషన్ ఏర్పాటు చేసిన చలి వేంద్రాన్ని ఆ అసోషియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బీసీ రెడ్డి, ఎన్పీడీసీఎల్ డైరెక్టర్లతో కలిసి సీఎండీ గోపాల్ రావు ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. విద్యుత్ అధికారులు, ఉద్యోగులు వినియోగదారులకు మెరుగైన సేవలు అందించాలని, విద్యుత్ సమస్యలు, నష్టాలు లేకుండా ప్రతి ఒక్కరు పని చేయాలని సూచించారు. కార్యక్రమంలో డైరెక్టర్లు బి.వెంకటేశ్వర్‌రావు, పి.గణపతి, పి.మోహన్ రెడ్డి, వి.తిరుపతి రెడ్డి, తెలంగాణ పవర్ డిప్లమో ఇంజనీర్స్ అసోషియేషన్ ఎన్పీడీసీఎల్ కంపెనీ శాఖ అధ్యక్షుడు ఇంద్రసేనా రెడ్డి, ప్రధాన కార్యదర్శి నార్ల సుబ్రమణ్యేశ్వర్ రావు, అసోషియేషన్ ప్రతినిధులు శ్రీకర్, మల్లికార్జున్ నరేష్, శ్రీనివాస్, వంశీకృష్ణ, సతీష్, రాజు పాల్గొన్నారు.

వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధనోత్సవాలు

కాజీపేట: కాజీపేట 62వ డివిజన్ సోమిడి గ్రామంలో సోమవారం పోతులూరు వీరబ్రహ్మేంద్ర స్వామి ఆరాధనోత్సవాలను సంఘం అధ్యక్షుడు శృంగారపు భిక్షపతి ప్రారంభించారు. విశ్వ బ్రహ్మణుల ఆరాధ్య దైవంగా వెలుగొందుతున్న బ్రహ్మంగారు సజీవ సమాధి పొందిన సందర్భాన్ని పురస్కరించుకుని ప్రతిఏటా ఘనంగా ఆరాధనోత్సవాలు జరుపుకోవడం ఆనవాయితీగా వస్తుంది. ఈసందర్భంగా 50 జంటలు గణపతి హోమంలో పాల్గొన్నాయి. అనంతరం అన్నదానం ఏర్పాటు చేశారు.

డంపింగ్ యార్డు తొలగించాలని ఆందోళన



ఆందోళనకారులను శాంతింపజేస్తున్న పోలీసులు

ఎంజీఎం:వరంగల్ నగరం నడిబొడ్డున జనావాసాల మధ్య పోతన నగర్‌లో ఉన్న డంపింగ్ యార్డును వెంటనే తొలగించాలని కాలనీవాసులు సోమవారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా రోడ్డుపై బైఠాయించి ఎమ్మెల్యే వినయ్‌భాస్కర్, మేయర్ సుధారాణికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తారు. అనంతరం కాలనీ వాసులు మాట్లాడుతూ పోతన నగర్‌లో ఏర్పాటు చేసిన డంపింగ్ యార్డు వల్ల ఆరోగ్య సమస్యలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని తెలిపారు. ఈ విషయంపై ఎమ్మెల్యే వినయ్‌భాస్కర్‌కు, మేయర్‌కు సుధారాణికి ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోకపోవడంతో పాటు డంపింగ్ యార్డు ఇక్కడే ఉంటుందని చెప్పడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే అధికారులు స్పందించి డంపింగ్ యార్డును తొలగించాలని డిమాండ్ చేశారు. స్థానికుల ఆందోళనతో పెద్ద ఎత్తున ట్రాఫిక్ జామ్ కావడంతో పోలీసులు అక్కడికి చేరుకుని ఆందోళనకారులకు నచ్చజెప్పారు.

పంట నష్టపరిహారం చెల్లించాలి



పంటలను పరిశీలిస్తున్న గంట రవికుమార్

ఖిలా వరంగల్: అకాల వర్షాలతో పంట నష్టపోయిన రైతులకు రూ.50 వేలకు తగ్గకుండా తక్షణమే పరిహారం చెల్లించాలని బీజేపీ నేతలు కుసుమ సతీష్, గంట రవికుమార్ డిమాండ్ చేశారు. అకాల వర్షాలు రైతన్నల జీవితాలను చిన్నాభిన్నం చేశాయని, రైతాంగానికి ప్రభుత్వం అండగా నిలవాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. శనివారం, ఆదివారాల్లో కురిసిన వర్షాలతో మధ్యకోటలో పంట పొలాలు నీట మునిగాయి. ఖిలా వరంగల్‌లో దెబ్బతిన్న పొలాలను బీజేపీ 38వ డివిజన్ అధ్యక్షుడు ఎల్లబోయిన చంద్రమోహన్, కిసాన్ మోర్చా అధ్యక్షులు ఇనుముల రాజుతో కలిసి కుసుమ సతీష్, గంట రవికుమార్ సోమవారం వేర్వేరుగా పరిశీలించారు. ఈసందర్భంగా పంట నష్టపోయిన రైతులను వారు కలిసి పంట నష్ట వివరాలను అడిగి తెలుసుకున్నారు. అధైర్య పడకండి మీకు బీజేపీ అండగా ఉంటుందని వారు బరోసా ఇచ్చారు. అనంతరం వారు మాట్లాడారు. ఒక రైతు బంధు పథకం రైతు చేతిలో పెట్టి వ్యవసాయ శాఖ ద్వారా ఇచ్చే సబ్సిడి పనిముట్లు, ట్రాక్టర్లు, ఇతర యంత్రాలు రాష్ట్ర ప్రభుత్వం సబ్సిడీపై ఇవ్వకుండా మోసం చేస్తుందని ఆరోపించారు. ఫసల్ బీమా యోజన పాలసీలు చెల్లిస్తే ఇలాంటి దుస్థితి ఉండకపోవచ్చని అన్నారు. కార్యక్రమంలో కిసాన్ మోర్చా అధికార ప్రతినిధి బండి సాంబయ్యయాదవ్, చిలువేరు రాజేందర్, ఒంటెల ప్రసాద్, బైరి నాగారాజు పుప్పాల ప్రవీణ్, శ్రీను, కిరణ్, సతీష్, మూర్తి, యాదగిరి, నర్సింగం పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు

మడికొండ: ధర్మసాగర్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో 1986–1987 పదో తరగతి చదివిన విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం సోమవారం మడికొండ శివారులోని ఓ ఫంక్షన్ హాలులో నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా విశ్రాంత విద్యాధికారి సోమిరెడ్డి పాల్గొని మాట్లాడుతూ నాడు ప్రభుత్వ పాఠశాలలో చదివిన విద్యార్థులు ఉన్నత స్థానాలలో ఉన్నందుకు గర్వంగా ఉందని పేర్కొన్నారు. అనంతరం నాటి ఉపాధ్యాయులను పూర్వ విద్యార్థులు సన్మానించారు. యాదగిరి, అశోక్, గోపి, ఇస్మాయిల్, రఘు, రాజిరెడ్డి, స్వామి సుధాకర్, అనురాధ, సరళ, శోభ, రమ, సుధ, మాదేవి ఉన్నారు.

బ్రహ్మోత్సవాలు



బ్రహ్మోత్సవాల్లో పాల్గొన్న భక్తులు

హన్మకొండ కల్చరల్ : భట్టుపల్లిలోని సూర్య కుటీర్‌లో శ్రీ సంపత్ వేంకటేశ్వరస్వామి దేవాలయంలో ప్రథమ బ్రహ్మోత్సవాలు అట్టహాసంగా నిర్వహించారు. మే 29నుంచి శ్రీమాన్ కలకోట సీతారామాచార్యుల ఆధ్వర్యంలో ఈ ఉత్సవాలు మొదలయ్యాయి. సోమవారం స్వామి వారి కల్యాణంతో పాటు ప్రభోదకి నిత్యహోమం, బలిహరణం కనుల పండువగా చేపట్టారు. సంధ్యాసమయంలో భక్తులు ఉత్సవమూర్తులకు పల్లకి సేవ నిర్వహించారు. కార్యక్రమంలో సంగన్నపల్లి హర్షవర్ధన్, భట్టుపల్లి సమీప గ్రామాల ప్రజలు, స్థానికులు పాల్గొన్నారు.

జిల్లావాసులకు శ్రమశక్తి అవార్డులు



హన్మకొండ: అవార్డు అందుకుంటున్న జాన్సన్



హన్మకొండ చౌరస్తా: అవార్డు అందుకుంటున్న శ్యాంసుందర్



కాజీపేట: అవార్డు అందుకుంటున్న సారంగపాణి

హన్మకొండ: విద్యుత్ కార్మికులకు సేవలు అందిస్తూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్న తెలంగాణ రాష్ట్ర విద్యుత్ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కె.వి.జాన్సన్‌కు రాష్ట్ర ప్రభుత్వం శ్రమశక్తి అవార్డు అందించింది. కార్మిక దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం హైదరాబాద్ రవీంద్రభారతిలో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర మంత్రి మల్లారెడ్డి చేతుల మీదుగా శ్రమశక్తి అవార్డును అందుకున్నారు. అవార్డు స్వీకరణ అనంతరం ట్రాన్స్‌కో, జెన్‌కో సీఎండీ డి.ప్రభాకర్ రావును కె.వి.జాన్సన్ మర్యాద పూర్వకంగా కలిశారు. తెలంగాణ విద్యుత్ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోడూరి ప్రకాశ్, తెలంగాణ ఎలక్ట్రిసిటీ ఇంజనీర్స్ అసోషియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు శివాజీ, నాయకులు జాన్సన్‌ను అభినందించారు.

శ్యాంసుందర్‌కు రెండోసారి..

హన్మకొండ చౌరస్తా: న్యూశాయంపేటకు చెందిన కుసుమ శ్యాంసుందర్ మంత్రి మల్లారెడ్డి చేతుల మీదుగా శ్రమశక్తి అవార్డును సోమవారం అందుకున్నారు. కార్మికుల పక్షాన గళం వినిపించే శ్యాంసుందర్ గత ఏడాది సైతం శ్రమశక్తి అవార్డును అందుకోవడం విశేషం.

సారంగపాణికి శ్రమశక్తి అవార్డు

కాజీపేట: కాజీపేట పట్టణానికి చెందిన తేలు సారంగపాణి శ్రమశక్తి అవార్డును సోమవారం రాష్ట్ర మంత్రి మల్లారెడ్డి చేతుల మీదుగా అందుకున్నారు. కార్మిక సంఘంలో కీలక పాత్ర పోషిస్తున్న సారంపాణి సేవలను గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వం అవార్డుకు ఎంపిక చేసింది. మే డే ఉత్సవాల్లో భాగంగా హైదరాబాద్‌లో సారంగపాణిని మంత్రి సన్మానించారు.

ఉచిత వైద్యశిబిరం



పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

హసన్‌పర్తి: 56వ డివిజన్ సప్తగిరికాలనీ, పూరిగుట్ట తండాలో సోమవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. హెల్పీ పబ్లిక్ అసోసియేషన్, గురు రెయిన్ బో ఆస్పత్రి ఆధ్వర్యంలో శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు ఉచితంగా అందజేశారు. ఈ కార్యకమంలో డాక్టర్ ప్రణీత, డాక్టర్ రాజేష్, డాక్టర్ రఘు, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

డ్రెస్‌కోడ్ పాటించాలి

వరంగల్: వరంగల్ ఏనుమాముల వ్యవసాయ మార్కెట్ పరిధిలో గ్రెయిన్ మార్కెట్, పండ్లు, కూరగాయల మార్కెట్లలో పనిచేస్తున్న సిబ్బంది, కార్మికులు విధుల నిర్వహణ సందర్భంగా తప్పని సరిగా డ్రెస్‌కోడ్ పాటించాలని మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ దిడ్డి భాగ్యలక్ష్మీ తెలిపారు. సోమవారం మే డే పురస్కరించుకొని మార్కెట్‌లో లైసెన్స్ కలిగిన హమాలీ, ఛాటావలి, గుల్లవాలి కార్మికులకు డ్రెస్ మెటీరియల్‌ను ఆమె పంపిణీ చేశారు. మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కాలేరు గాంధీ, రాజయ్య, రాహుల్, చందర్‌రావు, రాజ్‌కుమార్, జన్ను భాస్కర్, కృష్ణమీనన్, మురళీయాదవ్ పాల్గొన్నారు.

రింగు రోడ్డు పనులు పూర్తి చేయాలి



రోడ్డు ప్రతిపాదిత ప్రదేశాన్ని పరిశీలిస్తున్న ప్రసాద్

మామునూరు: వరంగల్ ఆర్టీఏ జంక్షన్ నుంచి ధర్మారం మీదుగా ఆరెపల్లి వరకు ప్రతిపాదించిన 200 ఫీట్ల రింగు రోడ్డును తక్షణమే నిర్మించాలని అఖిల భారత మహాత్మా జ్యోతి రావు పూలే సామాజిక న్యాయవేదిక రాష్ట్ర అధ్యక్షుడు కేడల ప్రసాద్ కోరారు. ఈమేరకు సోమవారం వరంగల్ ఆర్టీఏ జంక్షన్‌లో మురుగునీటితో పారుతున్న రోడ్డు స్థలాన్ని ప్రజా వేదిక నాయకులతో కలిసి ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడారు. జిల్లాలోని ముగ్గురు ఎమ్మెల్యేల పరిధిలో ప్రతిపాదన రింగ్ రోడ్డు ఉంటుందని, కొంత మంది భూనిర్వాసితులకు డబ్బులు సైతం చెల్లించారని, ఏళ్ల తరబడి నిర్మాణం పెండింగ్‌లో ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. బీఆర్‌ఎస్ పార్టీ ప్రజాప్రతినిధులు ప్రత్యేక చొరవ తీసుకుని రింగ్ రోడ్డు పనులను చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో సామాజిక కార్యకర్త ఎండీ ఫసి, లేక్ ప్రొటెక్షన్ కమిటీ చైర్మన్ పెరుమాళ్ల లక్ష్మణ్, దడిగెల రవి పటేల్, పుల్లోజు వేణు గోపాల్, కొమరయ్య, రాజ్‌సింగ్ అవతార్‌సింగ్, నీలం సంజీవ, నిమ్మల కిరణ్, కుమ్మరి కొమురయ్య, గన్నారపు అజయ్ పాల్గొన్నారు.

ఆటోడ్రైవర్లకు దుస్తుల పంపిణీ



దుస్తులు పంపిణీ చేస్తున్న కొండేటి శ్రీధర్

హసన్‌పర్తి: మే డేను పురస్కరించుకుని హసన్‌పర్తి మండల కేంద్రంలో బీజేపీ ఆధ్వర్యంలో సోమవారం ఆటో డ్రైవర్లకు దుస్తులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి బీజేపీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు కొండేటి శ్రీధర్‌ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కొండేటి శ్రీధర్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ గురుమూర్తి శివకుమార్, బీజేపీ డివిజన్ అధ్యక్షుడు మేకల హరిశంకర్, కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు మారపల్లి రాంచంద్రారెడ్డి, నాయకులు తాళ్ల రమేష్, మధుసూదన్, తిరుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చెత్తాచెదారం తొలగించాలి



స్వైర విహారం చేస్తున్న పందులు

ఖిలా వరంగల్: వరంగల్ 41వ డివిజన్ శంభునిపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల రహదారిపై చెత్తచెదారం గుట్టల్లా పేరుకపోయింది. దీంతో చెత్త నుంచి దుర్గంధం వెదజల్లుతోంది. ప్రజలు అటువైపు వెళ్లలేని పరిస్థితినెలకొంది. చెత్తపై పందులు స్వైర విహారం చేస్తున్నాయని, చెత్త చిందర వందర పడేస్తున్నాయని స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికైనా బల్దియా అధికారులు స్పందించి, చెత్త చెదారాన్ని తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.